క్లుప్తంగా

ఘనంగా ధర్మారావు జయంతి



పురస్కారాలు అందుకున్నవారిని సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో ప్రముఖ కవి, రచయిత, వక్త దూసి ధర్మారావు జయంతి దూసి ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ సాహితీ పురస్కారాన్ని కవి, కథా రచయిత గంటేడ గౌరునాయుడు, కళా పురస్కారాన్ని నృత్య దర్శకురాలు టి.నీరజా సుబ్రహ్మణ్యం, సేవా పురస్కారం అంబటి రంగారావుకు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పి.జగన్మోహనరావు, డాక్టర్ కె.సుధీర్, నూక సన్యాసిరావు, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతగా గుడివీధి జట్టు



ట్రోఫీ అందుకుంటున్న గుడివీధి జట్టు

శ్రీకాకుళం కల్చరల్: ఉగాది పర్వదినం పురస్కరించుకొని గుజరాతీపేట బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ పోటీల్లో గుడివీధికి చెందిన జట్టు విజేతగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. గత రెండు రోజులుగా నిర్వహించిన పోటీల్లో అరసవల్లి, గుడివీధి, గుజరాతీపేటకు చెందిన జట్లు పాల్గొన్నాయి. రన్నర్‌గా గుజరాతీపేట జట్టు నిలిచింది. విజేతలకు శనివారం ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పన్నాల నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడు పార్నంది విజయకుమార్, కార్యదర్శి దూసి నాగేశ్వరరావు, పెంట శ్రీధర్‌శర్మ, పెంటా శ్రీనివాసరావు, కస్తూరి సంతు, తెన్నేటి సునీల్ శర్మ, పార్నంది ప్రసాద్, గాయత్రి ప్రసాద్, రావుల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రంజాన్ తోఫా



సిద్ధం చేసిన రంజాన్ తోఫా కిట్లు

శ్రీకాకుళం కల్చరల్: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని జీటీరోడ్డులో ఉన్న జామియా మసీదులో పేద ముస్లింలకు జామియా మసీదు యువజన సభ్యులు రంజాన్ తోఫాను శనివారం అందజేశారు. రంజాన్ పండుగ ఆనందంగా జరుపుకోవడానికి 5 కేజీల గోధుమ పిండి, 5 కేజీల బియ్యం, కిస్మిస్, కాజు, పాలు, ఉప్పు, సేమియా, పంచదారల తదితర వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జామియా మసీదు యువజన సభ్యులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి



విచారణకు డిమాండ్ చేస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎచ్చెర్ల నియోజకవర్గ పాస్టర్ వెల్ఫేర్ సొసైటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయం, కలెక్టర్ కార్యాలయాల్లో శనివారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు శామ్యూల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మృతికి గల కారణాలపై పారదర్శకంగా దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పాస్టర్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు సూరిబాబు, ఇమ్మాన్యుయేల్, పేతురు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత



నోట్‌బుక్స్ అందజేస్తున్న వాసు

రణస్థలం: మండలంలోని జేఆర్‌పురం పంచాయతీకి చెందిన టంకాల వాసుదేవరావు గ్రామానికి చెందిన పేద విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ శనివారం అందజేశారు. విద్యార్థులంతా చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్వింకిల్ స్కూల్ డైరెక్టర్ దొడ్డి శ్యామ్, ప్రిన్సిపాల్ చాపాన ప్రభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవంలో వర్గపోరు

ఎచ్చెర్ల: లావేరు మండలంలో శనివారం చేపట్టిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పలుచోట్ల నాయకుల మధ్య వర్గ విభేదాలు బయటపడ్డాయి. బెజ్జిపురం గ్రామంలో మాజీ జెడ్పీటీసీ వర్గానికి చెందినవారు ఒకచోట ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అయితే మరికొంతమంది నాయకులు ఈ వర్గానికి సంబంధం లేకుండా వేరేగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఒకే పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు ఇలా వేర్వేరుగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం చర్చనీయాంశంగా మారింది.

వేసవికాలం.. ఆరోగ్యం భద్రం..!



- ఎండలతో డీ హైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం
- ద్రవ పదార్థాలు తీసుకోవాలని వైద్యుల సూచన

ఎచ్చెర్ల: ప్రస్తుతం ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ప్రతీ ఏడాది కంటే ఈ ఏడాది ముందుగానే ఎండలు మండుతుండడంతో రాబోయే రోజుల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వేసవికాలంలో తీసుకునే ఆహారమే ఆరోగ్యానికి కీలకమని వైద్యులు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు శరీరం డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. చెమట అధికంగా ఉత్పన్నమై లవణాలు తగ్గిపోతే వడదెబ్బ సోకే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

సమతుల ఆహారం అవసరం

వేసవిలో రోగ నిరోధక శక్తి పెంచే విధంగా ప్రతి ఒక్కరూ సమతుల ఆహారం తీసుకోవాలి. మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని కాపాడుతుందనే ఆలోచన కలిగి ఉండాలి. శరీరంలో 60 నుంచి 70 శాతం వరకు నీరు ఉంటుంది. అధిక ఉష్ణోగ్రతలను తగ్గించడంలో నీరు ప్రముఖపాత్ర పోషిస్తుంది. ప్రతీ మనిషి రోజుకు సగటున 3 నుంచి 4 లీటర్ల నీటిని తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉండడంతో పాటు డీహైడ్రేషన్‌కు గురవకుండా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. నిర్లక్ష్యం వహిస్తే వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. అలాగే తీసుకునే ఆహారంలో ఖనిజ లవణాలు అధికంగా ఉండేలా చూసుకోవాలి. పాలు, గుడ్లు, టమాటా, చిలగడ దుంప, చేపలు తినడం మంచిది. ఆహారంలో సొరకాయ, బీరకాయ, దోసకాయ, పొట్లకాయ, పాలకూర, తోటకూర తదితర కూరలు వినియోగించినట్లయితే ఆరోగ్యంగా ఉండవచ్చు.

పండ్లు మేలు

ప్రతిరోజూ ఎక్కువ పోషకాలుండే పండ్లను తినాలి. బొప్పాయి, జామ, అరటి, యాపిల్, పుచ్చకాయ వంటి పండ్లు తీసుకోవడం ఉత్తమం. బత్తాయి, కమల, నారింజ, నిమ్మరసాలు తాగినట్లయితే వడదెబ్బను తట్టుకోవచ్చు. రాగులు, సామలు, కొర్రలు, జొన్నలు వంటి చిరుధాన్యాలు తీసుకున్నట్లయితే ఆరోగ్యానికి ప్రయోజనం ఉంటుంది. ఎండల్లో ఎక్కువగా తిరిగే వ్యక్తులు ద్రవ పదార్థాలను రోజువారీ దినచర్యలో భాగం చేసుకోవాలి. మజ్జిగ, కొబ్బరినీరు, లస్సీ, చెరుకు రసం అధికంగా వినియోగించినట్లయితే ఇబ్బందులుండవు. మజ్జిగ శరీరంలో జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాగే కొబ్బరి నీరు తీసుకున్నట్లయితే శరీరానికి ఎంతో శక్తి లభిస్తుంది.

బయటకు రాకూడదు



ఎండలు ఎక్కువగా ఉండే సమయంలో ఎవరైనా అవసరం ఉంటే తప్ప బయటకు రాకుండా ఉండడం మంచిది. తలపై రక్షణకు గొడుగు లేదా టోపీ ధరించాలి. వదులుగా ఉన్న చేనేత వస్త్రాలు వేసుకోవాలి. ఎక్కువ నీరు తీసుకోవడంతో పాటు 8 గంటల నిద్ర తప్పనిసరి. ఉదయం, సాయంత్రం వ్యాయామం చేస్తే ఆరోగ్యం నిలకడగా ఉంటుంది.

– జె.మౌనిక, వైద్యురాలు, లావేరు పీహెచ్‌సీ

బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి



అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేసిన డీపీటీవో విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: యువత తమ కాళ్లపై తాము నిలబడి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ అన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ హెవీ వెహికల్ డ్రైవింగ్ స్కూల్ శ్రీకాకుళంలో శిక్షణ పూర్తి చేసుకున్న 19వ బ్యాచ్ డ్రైవర్లకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో మంచి డ్రైవర్లుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఆర్టీసీలో శిక్షణ తీసుకున్నందుకు వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. హెవీ వెహికల్ డ్రైవింగ్ 20వ బ్యాచ్ ఏప్రిల్ మొదటి వారంలో మొదలవుతుందని, లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్, ఒక సంవత్సరం అనుభవం కలిగిన వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 40 రోజుల శిక్షణతో పాటు మెకానికల్ వర్క్, యోగ, వ్యక్తిత్వ వికాసం, ట్రాఫిక్, రోడ్డు ట్రాఫిక్ రూల్స్‌పై శిక్షణ ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2, టెక్కలి డిపో మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కె.రవిశంకర్ శర్మ, శ్రీనివాస్, శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఆర్టీసీ ఎస్ఎం ఎంపీ రావు, కె.సుమన్, శిక్షకుడు జి.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.

ఐదు సచివాలయాల్లో ఆధార్ నమోదు

సాక్షి ఎఫెక్ట్...



ఆధార్ నమోదు చేస్తున్న అర్జునవలస సచివాలయ సిబ్బంది

రణస్థలం: అర్జునవలస, కోష్ట, కోటపాలెం, పాతర్లపల్లి, యర్రవరం గ్రామ సచివాలయాల్లో నిరంతరం ప్రభుత్వ పనివేళల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తహసీల్దార్ ఎస్.ప్రసాద్, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావులు తెలిపారు. ఆధార్ కేంద్రాల్లో అదనపు వసూళ్లపై సాక్షి పత్రికలో శనివారం ప్రచురితమైన కథనానికి స్పందించారు. దీనిలో భాగంగా రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు ఐదు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఐదు ఆధార్ కేంద్రాల్లో ప్రభుత్వ నిర్దేశిత రుసుము చెల్లిస్తే సరిపోతుందన్నారు.

సజావుగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ పిన్నింటి రజని

రణస్థలం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పిన్నింటి రజని అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా మండలంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. తదుపరి వివిధ శాఖల అధికారులు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులను వివరించారు. అయితే సర్వసభ్య సమావేశానికి నిత్యం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి(ఎఫ్‌డీవో) కె.గంగాధరరావు గైర్హాజరవుతుండడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీహెచ్ రాజాం గ్రామంలోని అంగన్‌వాడీ భవనాన్ని పాఠశాల మొదటి అంతస్తులో ఎందుకు నిర్మిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం ఎంఈవో లావణ్యను ప్రశ్నించారు. దీంతో ప్రస్తుత పాఠశాల విద్యా విధానంలో భాగంగా నిర్మాణం జరగవచ్చునని ఆమె తెలిపారు. ఇదే విషయంపై సీడీపీవో ఝాన్సీబాయ్ మాట్లాడుతూ.. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి స్థలం కేటాయించకపోవడంతో నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఎంపీటీసీ సభ్యుడు మజ్జి రమేష్ మాట్లాడుతూ ఇటీవల రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు సేకరించినా ఫలితం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి తహసీల్దార్ స్పందించి ఈ సమస్య జేసీ స్థాయిలోనే ఉందని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో మండల ప్రత్యేకాహ్వానితుడు పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఐదుగురు విద్యార్థులను డిబార్ చేసి, వారి జీవితాలతో విద్యాశాఖ అధికారులు ఆడుకుంటున్నారని ప్రజా సంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎచ్చెర్ల మండలంలోని కుప్పిలిలో 10వ తరగతి ఇంగ్లిష్ పరీక్ష సమయంలో డిబార్ చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రజాసంఘాల ప్రతినిధులు శనివారం మాట్లాడారు. విద్యా ప్రమాణాలపై దృష్టి పెట్టాల్సిన అధికారులు విద్యార్థులను డిబార్ చేయడం అన్యాయమన్నారు. వారికి జూన్‌లో నిర్వహించే సప్లిమెంటరీ పరీక్షల్లో అనుమతి ఇవ్వాలని, విలువైన విద్యా సంవత్సరం కోల్పోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విన్నవించారు. విద్యార్థులకు న్యాయం జరగకుంటే భవిష్యత్‌లో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఉపాధ్యాయుల సస్పెన్షన్ రద్దు చేసిన అధికారులు, విద్యార్థులు డిబార్ ఎందుకు రద్దు చేయరని ప్రశ్నించారు. విద్యార్థులు జీవితం విలువైంది కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.జగన్నాథరావు, మత్స్యకార సంఘ నాయకుడు ఫల్గునరాజు, రాష్ట్ర కుల నిర్మూలన పోరాట సమితి అధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, సామాజిక న్యాయపోరాట సమితి ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, మానవ హక్కుల సంఘం వేదిక నాయకుడు టీవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ఇంటర్ పాఠ్య పుస్తకాలు

- ఇండెంట్ ప్రకారం రాకపోవడంతో ఖంగుతిన్న అధికారులు



పాఠ్య పుస్తకాలు దించుతున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు 2025–26 విద్యా సంవత్సరానికి గానూ ఇంటర్మీడియట్ పాఠ్య పుస్తకాలు వచ్చాయి. శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం సాయంత్రం వాహనంతో వచ్చిన పాఠ్య పుస్తకాలను భద్రపరిచారు. అయితే ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల నుంచి తీసుకున్న ఇండెంట్ ప్రకారం పుస్తకాలు రాలేదని గుర్తించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసి రిలీవ్ అవుతున్న విద్యార్థుల ఇండెంట్ ప్రకారం ప్రస్తుత ఫస్టియర్ విద్యార్థులకు పుస్తకాలొచ్చాయి. అది కూడా ఇంగ్లిష్ మీడియం పుస్తకాలు రావడంతో ఖంగుతిన్నారు. పెట్టిన ఇండెంట్‌లో 90 శాతం వరకు తెలుగు మీడియం విద్యార్థులే కావడంతో ఈ పుస్తకాలు ఏం చేయాలో తెలియడంలేదని అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ లెక్కన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని భావిస్తున్నారు. అయితే రెండో ఫేజ్‌లో మిగిలిన పాఠ్య పుస్తకాలను పంపించే ఛాన్స్ ఉంటుందని అంచనా వేస్తున్నారు. పాఠ్య పుస్తకాలను వాహనం నుంచి దించే కార్యక్రమాన్ని డీవీఈవో శివ్వాల తవిటినాయుడు, ఆర్ఐవో ప్రగడ దుర్గారావు తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా ఉగాది వేడుకలు

జిల్లాలోని పలు పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఉగాది పచ్చడి తయారు చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. తెలుగు సంవత్సరాల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



ఎచ్చెర్ల క్యాంపస్: ఉగాది పచ్చడి చేసేందుకు సిద్ధం చేసిన సామగ్రి





శ్రీకాకుళం కల్చరల్: పెన్సిల్ ముల్లుపై 'ఉగాది' ఇన్‌సెట్లో (చెక్కుతున్న శ్రీనివాసరావు)



శ్రీకాకుళం కల్చరల్: ఉగాది సంబరాల్లో చిన్నారులు

సంక్షిప్తంగా..

ఆదిత్యుని సన్నిధిలో ఉగాది ఉత్సవాలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో విశ్వావసు నామసంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ ఈఓ వై.భద్రాజీ, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 7 గంటలకు ఆదిత్యుని రాశిఫలాలు, పంచాంగ పూజలను ప్రధానార్చకులు శంకరశర్మ నిర్వహించనున్నారు. అలాగే ఆలయానికి చెందిన కొత్త రికార్డు పుస్తకాలను పూజలు చేయనున్నారు. ఇక సాయంత్రం 4 గంటల నుంచి భక్తుల రాశిఫలాలను ఆలయ అర్చకులు అనివెట్టి మండపంలో వివరించనున్నారు.

శ్రీకూర్మనాథాలయంలో...

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో ఆదివారం ఉదయం నుంచి ఉగాది వేడుకలు జరగనున్నాయని ఆలయ ఈఓ జి. గురునాథం, ఆలయ ప్రధానార్చకులు సీహెచ్ సీతారామ నృసింహాచార్యులు తెలిపారు. సాయంత్రం ఆస్థాన మంటపంలో పంచాంగ శ్రవణం ఉంటుందని పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని చింతాడ గ్రామ సమీపంలో శనివారం పేకాట ఆడుతుండగా నలుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. వీరివద్ద నుంచి రూ.1800లతో పాటు నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'టెన్త్‌స్పాట్' టీచర్ల సీనియారిటీ జాబితా విడుదల

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని పదో తరగతి పరీక్షల జవాబుపత్రాల స్పాట్ వాల్యూయేషన్‌కి సంబంధించి సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు సీనియారిటీ జాబితాలు విడుదలయ్యాయి. జిల్లా విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితాను ఉంచినట్లు డీఈవో తిరుమల చైతన్య తెలిపారు. స్పాట్ వాల్యూయేషన్ విధుల నుంచి మినహాయింపు కోరే ఉపాధ్యాయుల దరఖాస్తులను, ఈనెల 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి 31 తేదీ సాయంత్రం 5 గంటల వరకు క్యాంప్ కార్యాలయం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల శ్రీకాకుళంలోని ప్రత్యేక కౌంటర్లలో స్వీకరించడం జరుగుతుందని చెప్పారు. 61 ఏళ్ల నుంచి 62 సంవత్సరాల మధ్య వయస్సు కలిగినవారు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు కలిగినవారు, దివ్యాంగులు తదితరులు మాత్రమే మినహాయింపునకు అర్హులని స్పష్టం చేశారు.

శాశ్వత లోక్ అదాలత్‌లో విస్తృత సేవలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శాశ్వత లోక్ అదాలత్‌లో విస్తృతమైన సేవలు అందిస్తున్నట్లు జిల్లా న్యాయశాఖ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. శనివారం న్యాయ సేవాధికార సంస్థలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి./ జ్ఞాన సువర్ణ రాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

చెక్ పవర్ తొలగింపుపై నోటీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: స్థానిక సంస్థల పాలనలో కూటమి నాయకుల జోక్యాన్ని అడ్డుకుంటున్న బొంతలకోడూరు సర్పంచ్‌పై కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా ఆయనకు జిల్లా పంచాయతీ అధికారి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కూటమి నాయకుల ఫిర్యాదు మేరకు చెక్ పవర్ ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలని ప్రశ్నించారు. గ్రామ సచివాలయ భవనం నిబంధనలు మేరకు నిర్మించడం లేదని, పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసినట్లు అభియోగాలు మోపారు. దీనిపై సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు మాట్లాడుతూ.. 2022లో సచివాలయ భవన నిర్మాణాన్ని జిల్లా పరిషత్ ఆమోదం, కలెక్టర్ ఆదేశాలతో ప్రారంభించామన్నారు. అయితే పాఠశాల ప్రాంగణంలో నిర్మాణం వద్దని హైకోర్టు సూచనలు మేరకు ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణాలు నిలిపివేయమన్నారని తెలిపారు. కాంట్రాక్టర్‌కు చేపట్టిన పనుల మేరకు బిల్లులు రూ.1.81 లక్షలు చెల్లించామని వెల్లడించారు. దీనిపై కాంట్రాక్టర్ మెట్ట హరిహరరావును విచారించవచ్చని పేర్కొన్నారు. బిల్లులు తప్పుగా ఉన్నట్లయితే నిధులు వెనక్కి చెల్లిస్తానని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ కక్ష, కూటమి నాయకుల ఒత్తిడితో చెక్ పవర్ రద్దుకు సిద్ధమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రామ్మోహన్‌నాయుడి కృషి అభినందనీయం



వినతిపత్రం అందజేస్తున్న శిష్టకరణ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చేస్తున్న కృషి అభినందనీయమని శిష్టకరణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు డబ్బీరు శ్రీనివాస్ (వాసు) అన్నారు. ఈ మేరకు ఢిల్లీలోని కేంద్ర పార్లమెంట్ హాల్‌లో వీరేంద్రకుమార్, కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిక శాఖ మంత్రి, జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హాన్స్‌రాజన్ జి.అహిర్‌లను శనివారం కలిసి సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో అక్కుమహంతి రాజా, బెలగాం జయప్రకాశ్, నారాయణ, సింహగిరి పట్నాయక్, గౌరీ శంకర్, జి.వి.మురళీకృష్ణ, ఆర్.వి.ఎస్.శర్మ, ఉరిటి కిరణ్‌బాబు, బలివాడ సత్యరావు, వీనం శ్రీనివాసు, బీఎస్‌కే పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అడ్వకేట్ కృష్ణచంద్‌కు సన్మానం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా కోర్టులో ఏకకాలంలో 8 కోర్టులకు పీపీగా పనిచేస్తూ మూడేళ్ల కాలాన్ని పూర్తి చేసుకున్న సీనియర్ న్యాయవాది వాన కృష్ణచంద్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లాశాఖ సభ్యులు నగరంలోని ఎన్జీవో హోమ్‌లో శనివారం సన్మానించారు. అటు బీసీ సంఘంలో, ఇటు న్యాయవాద వృత్తిలో ప్రజలకు నిరంతరం సేవలందించడం ప్రశంసనీయని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: దళితుడైన యరగడ రాము హత్య ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని దళిత సంఘాల జేఏసీ నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆయన చాంబర్‌లో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఘటన జరిగిన సుమారుగా 20 రోజులు కావస్తున్నా హత్యకు గల కారణాలు పోలీసులు తెలియజేయడం లేదని వాపోయారు. రామును ఎవరో హత్యచేసి జరజాం రోడ్డులో పడివేసి ఉంటారని, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు. తక్షణమే విచారణ వేగవంతం చేసి, హంతకులను శిక్షించాలని విన్నవించారు. కార్యక్రమంలో యరగడ రాజేష్, దూలపు అప్పన్న, గండి రాజు, యరగడ గణేష్, బూర చిన్నారావు, సురా యరయ్య, యరగడ అసిరయ్య, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దండాసి రాంబాబు, తిరుమల, రాజు బలరాం, తోట రాము తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి: ఎస్పీ

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసులు వృత్తి నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో శనివారం రెండు వారాలు పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు నిర్వహించిన 14 రోజుల మొబలైజేషన్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ మొబలైజేషన్ కార్యక్రమంలో కొత్త అంశాలు, నైపుణ్యాలు నేర్చుకున్నారని అన్నారు. వృత్తిలో చోటు చేసుకుంటున్న సాంకేతికత, కొత్త ఆయుధాల వినియోగం వంటివి తెలుసుకోవాలని అన్నారు. వ్యక్తిగత క్రమశిక్షణ, దేహ దారుఢ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. యోగా, మెడిటేషన్, శారీరక వ్యాయామాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.వి.రమ ణ, డీఎస్పీ శేషాద్రి, అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: చట్టాలపై మహిళలు, బాలికలకు అవగాహన అవసరమని పలువురు పేర్కొన్నారు. స్థానిక నైరాలోని అగ్రికల్చర్ కాలేజీలో నాల్గో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి ఎస్ఎం ఫణికుమార్, స్థానిక కొన్నవీధిలోని గవర్నమెంట్ కాలేజ్ గర్ల్స్ హాస్టల్–1లో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కేవీఎల్ హిమబిందు, కొన్నవీధిలోని గవర్నమెంట్ గర్ల్స్ హాస్టల్–2లో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి యుగంధర్‌లు పోక్సో చట్టంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా మారుతున్న చట్టాలతో పాటుగా కొత్తగా వస్తున్న చట్టాల గురించి కూడా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పి.అంజనీకుమార్, పి.హర్షవర్ధన్, అడ్వకేట్ జి.ఇందిరాప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘురాం తదితరులు పాల్గొన్నారు.

తెరవే ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు



ఉగాది సత్కారాలు అందుకుంటున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సర వేడుకలు శనివారం సాయంత్రం జిల్లా కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో జరిగాయి. ఈ సందర్భంగా విశ్రాంత సెట్‌శ్రీ సీఈవో సురంగి మోహనరావు మాట్లాడుతూ తెరవే రచయితలంతా తెలుగు భాష కోసం ఎంతో కృషి చేస్తున్నారని మెచ్చుకున్నారు. పలువురు కవులు తమ కవితలను చదివి వినిపించారు. విజ్ఞానవేత్త వాండ్రంగి కొండలరావు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత మణిపాత్రుని నాగేశ్వరరావు, వ్యాసకర్త గొర్లె జగ్గునాయుడులను ఉగాది పురస్కారాలతో సత్కరించారు. అనంతరం బీఎస్ ప్రసాద్ రచించిన 'వెన్నెల వెలుగులు' సాహితీ పుస్తకాలను సభ్యులకు అందించారు. కార్యక్రమంలో తెరవే అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, ఆర్‌వీ రమణమూర్తి, ముట్నూరు ఉపేంద్ర, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార రాజు, మేకల రామకృష్ణ, రెడ్డి లలితా, తులాల సవరమ్మ, తెప్పల కృష్ణమూర్తి, బారువ కోమల రావు, ఇద్ది పాపయ్య, కిల్లాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.